క్లుప్తంగా

పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పీసీ రెడ్డెన్న



రాయచోటి టౌన్ : ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పీసీ రెడ్డెన్న ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. శుక్రవారం రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన 48వ సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు. అన్నమయ్య జిల్లా (ఉమ్మడి వైఎస్సార్) రాయచోటి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్పంచ్ తుర్రా చిన్నక్క తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దపల్లె పంచాయతీ పరిధి భాకరాపేటలో డ్రైనేజీ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు తుర్రా ప్రతాప్, ఉప సర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మురళీమోహన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్ రవిశంకర్

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కమాండెంట్ పి.రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లోని కల్యాణ మండపంలో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి, ఓం ఆర్థోపెడిక్ వారిచే కంటిచూపు, కీళ్లు, ఎముకల సమస్యలకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఆప్తాల్మిక్ వైద్యురాలు స్నిగ్ధ, డాక్టర్ ఆనంద్, వైద్య సిబ్బంది బెటాలియన్‌లో ఉన్న పోలీసులు వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు 158 మందికి వైద్య పరీక్షలు జరిపి, మందులను అందజేశారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీకి ఉచిత వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్ కమల్

నందలూరు(రాజంపేట) : టీబీకి ఉచితంగా వైద్య పరీక్షలు ౹నిర్వహించడంతోపాటు వారికి మందులు ఉచితంగా అందజేస్తామని రాజంపేట టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. పొత్తపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల పైబడి దగ్గు, రాత్రిపూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం ఇలాంటి లక్షణాలు ఉన్నవారు నందలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా పరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా ఆరు నెలలు ఆశా వర్కర్ పర్యవేక్షణలో మందులు మింగించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చెన్నారెడ్డి, ల్యాబ్ సూపర్‌వైజర్ మల్లికార్జున, శివరాం, ఆరీఫ్, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పుల్లంపేట : మండల కేంద్రంలోని శ్రీ పర్వతవర్ధినీ శాంతిలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ. 86649ల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుధీర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వై.హరినాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

కలికిరి : ఎన్నికల విధులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎస్.రమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గంలోని ఎన్నికల విధులలో పాల్గొను ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, వీడియో వీయింట్ టీం, ఎంసీసీ టీం సభ్యులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు.

పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ

- పేదలకు అందించిన భూములపై పూర్తి హక్కులు వారికే
- మండలంలోని అన్ని చెరువులకు ఝరికోన నీరు
- శెట్టిపల్లెలో జరిగిన పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సంబేపల్లె: భూ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు



రాయచోటి: ఇఫ్తార్ విందును వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : ఏళ్ల తరబడి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో జరిగిన ఫ్రీ హోల్డ్ (2003 సంవత్సరానికి ముందు ఇచ్చిన డీకేటీ పట్టాలకు రెగ్యులరైజేషన్) పట్టాల పంపిణీ, అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డిలతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఫ్రీ హోల్డ్ పట్టాలు 5,610 మంది లబ్ధిదారులకు 4,510.18 ఎకరాల భూములపై సర్వ హక్కులు కల్పించామన్నారు. అసైన్‌మెంట్ కమిటీ రెండవ విడతలో మండలంలో 411 రైతులకు 452.63 ఎకరాలను భూ పంపిణీలో భాగంగా అందజేశామన్నారు. ఒక్క శెట్టిపల్లె గ్రామంలోనే ఫ్రీ హోల్డ్ పట్టాల కింద 1,484 మంది లబ్ధిదారులకు 1348.3 ఎకరాల భూమి రెగ్యులరైజేషన్ చేశామని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు. అసైన్‌మెంట్ భూములు 80 మంది లబ్ధిదారులకు 91.73 ఎకరాలను పట్టాలుగా మార్చి బడుగు, బలహీన పేదల కుటుంబాలకు వెన్నుదన్ను నిలుస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. పెద్ద బిడికిలో పొజిషియన్ సర్టిఫికెట్లు కూడా అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఝరికోన నీటిని మండలంలోని చెరువులకు అందించే పనుల టెండర్ ప్రక్రియ పూర్తయిందని, పనులను పూర్తి చేసి మండలంలోని చెరువులకు నీటిని తప్పక అందించి తీరుతామని ప్రజలకు తెలియజేశారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన జనరంజకంగా కొనసాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ఆధారంగా జగన్ పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో శెట్టిపల్లె గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని, రానున్న ఎన్నికల్లో శ్రీకాంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి..

పేదలకు సంక్షేమం, మానవ వనరుల అభివృద్ధితో పాటు కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబన తీసుకురావడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గడికోట అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ సేవలను తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యాన్ని చేతల్లో చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన పాలనలో చెప్పుకునేందుకు శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటీ లేదన్నారు. గ్యారంటీ అంటూ ప్రతిపక్ష నేత చెబుతున్న బూటకపు హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చిన సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

శెట్టిపల్లె గ్రామంలో పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగగా పట్టాల పొందినవారు హర్షాతిరేకాలు వ్యక్తం చేయడంతోపాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అనిరుద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు వెంకట్రమణనాయక్, రఘునాథరెడ్డి, వి.వి.ప్రతాప్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, నరసింహారెడ్డి,మాధవ్‌నాయుడు, జయనారాయణరెడ్డి, మహేశ్వర్, తిరుపాల్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాయచోటి టౌన్ : సీఎం సహాయనిధి డబ్బులు లబ్ధిదారులకు కొండంత అండగా నిలుస్తోందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో 7 మంది లబ్ధిదారులకు రూ.16.40 లక్షల చెక్కులను అందజేశారు. లబ్ధి పొందిన వారిలో రామాపురం మండలానికి చెందిన ఏకిలపల్లె తుమ్మల అశ్వినికి రూ.50 వేలు, చిన్నమండెం మండలం చాకిబండకు చెందిన సయ్యద్ నసీమా రూ.లక్ష, మల్లూరు గ్రామం కొడిదపల్లెకు చెందిన అల్లం రమణమ్మకు రూ.5లక్షలు, కేశాపురానికి చెందిన వర్ధిరెడ్డి వెంకటరెడ్డికి రూ.1.2లక్షలు, రాయచోటి టౌన్ చెక్ పోస్టు సమీపంలో వండాడి జయప్రకాష్‌కు రూ.5లక్షలు, బండ్లపల్లెకు చెందిన మయాన కరీముల్లా ఖాన్‌కు రూ.2.70 లక్షలు, గాలివీడు మండలం కమలామర్రి పెద్దపల్లెకు చెందిన మానం రాములమ్మకు రూ.1లక్షల చెక్కులను అందజేశారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

రాయచోటి : పేదవారి ఆకలి విలువ తెలుసుకోవడమే రోజా ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో లక్ష్మీ థియేటర్ వెనుక వీధిలోని జబ్బార్ మసీదు వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంతకుముందు ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మందనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, స్థానిక కౌన్సిలర్ అల్తాఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రియాజ్ రెహమాన్, ఎస్ రిజ్వాన్, ఇర్ఫాన్, మాజీ కో–ఆప్షన్ జాఫర్ అలీఖాన్, అబుజర్, అఫ్సర్, ఖాజా, యువజన విభాగం అధ్యక్షులు కొత్తపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

18న వేలంపాట

గాలివీడు : ఈనెల 18న సోమవారం మధ్యాహ్నం 3గంటలకు పశువుల, కూరగాయాల వారాంతపు సంత నిర్వహణకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. మాట్లాడుతూ గాలివీడు పంచాయతీ పరిధిలోని పశువుల సంతకు రూ.2లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50 లక్షలు, బస్టాండు గేటుకు రూ.50వేలు డిపాజిట్ రూపంలో పంచాయతీ కార్యాలయంలో చెల్లించిన వారు వేలంలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు.

రాజంపేట జేసీఎస్ కన్వీనర్‌గా సుధాకర్



నడివీధి సుధాకర్

రాజంపేట : రాజంపేట అసెంబ్లీ జేసీఎస్ కన్వీనర్‌గా నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ అరవపల్లెకు చెందిన నడివీధి సుధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి అసెంబ్లీ జేసీఎస్ కన్వీనరుగా నియమించినందుకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియచేశారు. బూత్‌ల వారీగా పార్టీని బలోపేతం చేసి ఆకేపాటిని గెలిపించుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కలకడ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలకడ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని బొంతలవారిపల్లెలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఉపాధి అంటూ ఎవరైనా హామీ ఇస్తే మోసపోకుండా తమకు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థికాభివృద్ధికే వైఎస్సార్ చేయూత



రాజంపేట టౌన్: లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఆకేపాటి



మంచినీటిని పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : రాష్ట్రంలోని ప్రతి మహిళ మోములో చిరునవ్వులు నింపడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆంధ్ర కల్యాణ మండపంలో శుక్రవారం రూరల్ పరిధిలోని వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు ఆకేపాటి చేతుల మీదుగా రూ.4.14 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థికావృద్ధి సాధించేందుకు సీఎం ప్రతి పథకం మహిళలు లబ్ధి చేకూరేలా ప్రవేశ పెట్టారన్నారు. మహిళలు జగన్ అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచి మళ్లీ ఆయనను సీఎం చేస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి పేదరికం లేని సమాజాన్ని స్థాపించగలరన్నారు. అందువల్ల ప్రతి ఓటరు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాగా నాల్గో విడత చేయూతలో 2206 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నగదును జమ చేయనుంది.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఒంటిమిట్ట: వేసవి కాలంలో ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలోని ఓసీ కాలనీలో రూ. 6లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభం ఆకేపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మహిళలకు మంచినీటిని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కూండ్ల ఓబుల్‌రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిరెడ్డి, నాగార్జునరాజు, రవి రాజు, దుగ్గల మధుసూదన్‌రెడ్డి, దుగ్గల వెంకటసుబ్బారెడ్డి, డీలర్ చంద్రశేఖర్ రాజు, శివరాజు, రామిరెడ్డి, వెంకటరెడ్డి, పాల్లెం రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ధ్యేయం



చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డిలు

పుల్లంపేట : మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమేని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా మహిళలు కుటుంబం అభివృద్ధి చెందితే తద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా మహిళలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది వైఎస్సార్ చేయూత ద్వారా మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. పుల్లంపేట మండలానికి రూ. 2.63 కోట్ల మెగా చెక్కును శుక్రవారం మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జెడ్పీటీసీ గీతాదేవి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, నళిని, ఎంపీడీఓ నరసింహామూర్తి, వెలుగు కో ఆర్డినేటర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం



ఓబులవారిపల్లె: బస్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని చిన్నఓరంపాడు అడ్డరోడ్డులోని బస్‌షెల్టర్‌ను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి సొంత నిధులతో పనులు చేపట్టి, బస్‌షెల్టర్‌ను పూర్తి చేశారు. శుక్రవారం నిర్మాణం పూర్తయిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. త్వరలో బస్‌షెల్టర్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కొరముట్ల తెలియజేశారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, మారే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ ఓబిలి వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గాడెల కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్ పార్టీ నాయకులు రామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ప్రభుత్వవిప్ నాయకులతో కలిసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ అధికారిణి జ్యోతి

సిద్దవటం : బీసీ వసతి గృహంలో ఉండి చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఉన్నత పదవులు సాధించవచ్చునని అసిస్టెంటు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నైతిక విలువలను పెంచుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యాక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌పీబీవీడీ సభా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎండీ మధుసూదన్, ఉపాధ్యాయులు, స్థానిక వసతి గృహం అధికారి రాజానాయక్ ఇతర వసతి గృహాల వార్డెన్‌లు ప్రసాద్, యాకోబ్, క్రిష్ణవేణి, రాజబాబు, సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చిన ఘనత జగన్‌దే



మహిళలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న కౌన్సిలర్లు జబీవుల్లా

రాయచోటి అర్బన్ : అక్కాచెల్లెమ్మల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ఒక ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జబీవుల్లా, వైఎస్‌ఆర్‌సీపీ నేత ఎస్‌పీఎస్ రిజ్వాన్‌లు అన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లె 5వ వార్డులో జగనన్న కాలనీ లబ్ధిదారులకు శుక్రవారం వారు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నూతన పెన్షన్లు, ఇంటి పట్టాల మంజూరు కాలేదన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత అర్హులందరికీ పక్కా గృహాలు, పెన్షన్‌లతోపాటు నవరత్నాలలో భాగంగా ప్రభుత్వ పథకాలు ఎలాంటి సిఫారసులు లేకుండా మంజూరవుతున్నాయన్నారు. మహిళల పేరుతో మంజూరు చేసిన ఇంటి పట్టాలను ఎటువంటి రుసుం తీసుకోకుండానే వారి పేరుతో ఉచితంగా రిజిస్ట్రషన్ చేయించి పత్రాలను అందజేస్తుండటం సంతోషదాయకమని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న జగనన్నను మరోమారు సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

గ్రామ స్వరాజ్యానికి సచివాలయాలు చిహ్నాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : గ్రామ స్వరాజ్యానికి సచివాలయాలు చిహ్నాలని రాష్ట్ర గిడ్డంగుల, గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని నరవకాటిపల్లె పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సర్పంచ్ మాచుపల్లి లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ టక్కోలి లక్ష్మీప్రసన్నల ఆధ్వర్యంలో శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం నిర్మాణలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, సర్పంచులు మేరువ శివనారాయణ, దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు టక్కోలి శివారెడ్డి, మాచుపల్లి వెంకటరెడ్డి, గంగిరెడ్డి, ఏట కిరణ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ కె.చంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం : ఎండాకాలం దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తంగా చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో కాన్పులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలన్నారు. వైద్యులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాల్లన్నారు. డాక్టర్ సనా ఆయేషా, సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

వాల్మీకిపురం: స్థానిక పీవీసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ప్రతి వినియోగదారుడు తన హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం వినియోగదారుల అవగాహన పోస్టర్లను ఉపాధ్యాయులతో కలసి ఆవిష్కరించారు.

వైభవంగా అక్కదేవతల పూజ

వాల్మీకిపురం: పట్టణ శివారు ప్రాంతంలోని శతశృంగ పర్వతశ్రేణుల్లో కొలువైన అక్కదేవతల ఆలయంలో శుక్రవారం అక్కదేవతల పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం పూజారి వెంకటరాజు ఆధ్వర్యంలో గుర్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గుడి వద్ద అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్తమ ఫలితాల సాధనతోనే భవిష్యత్



విద్యార్థులకు జ్ఞాపికను అందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లె : పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, గురుకుల పాఠశాలల్లో పది పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ పరీక్షల సమయంలో మంచి ఆహారం తీసుకోవాలన్నారు. చదువుతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మానసిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులను పక్కన పెట్టి శ్రద్ధగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పది ఫలితాలు భవిష్యత్తుకు దిశానిర్దేశనం చేస్తాయని, మంచి మార్కులు వచ్చేలా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు కరువు!



బూత్ కన్వీనర్లకు బ్యాగ్‌లను అందజేస్తున్న ఆకేపాటి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు కరువయ్యారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం రాజంపేట బైపాస్‌లో కళాంజలి గార్డెన్స్‌లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సభలో ప్రతిపార్టీల తీరుతెన్నులను ఎండగట్టారు. స్థానికేతర అభ్యర్థులను దిగుమతి చేసుకునే దుస్థితి ప్రతిపక్ష పార్టీలకు కలిగిందని, ఇది దురదృష్టకరమన్నారు. ప్రతిపక్షాలు ఏకమైన ఇంతవరకు అభ్యర్థులను నిలబెట్టుకోలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి తానన్నారు. నియోజకవర్గానికి నేను ఒక కాపలాదారునిగా ఉంటానన్నారు. మాలో వర్గాలు లేవని మేమంత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్గమేనన్నారు. రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి చెందిందింటే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లేనని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చేసుకోవడమే మనందరి లక్ష్యమన్నారు. అందరి సహకారంతోనే జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. సభలో జెడ్పీచైర్మన్ సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, పట్టణ వైఎస్సార్‌సీ కన్వీనర్ కృష్ణారావుయాదవ్, జేసీఎస్ కన్వీనర్ వడ్డె రమణ, మందరం గంగిరెడ్డి, రూరల్ మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రాజు, అసెంబ్లీ జేసీఎస్ కన్వీనరు నడివీధి సుధాకర్, అమర, జడ్పీటీసీ దాసరి పెంచలయ్య, దండు గోపి, గోవిందు బాలకృష్ణ, మహిళనేత శ్రీవాణి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాల అంకురార్పణ

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆలయంలో వేకువజామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో కలశస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వస్తివాచనం, పుణ్యాహవాచనం కావించారు. అనంతరం రక్షాబంధనం, మృత్యంగ్రహణం, అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.